
# ఒంటరి

- వై. శాయి




జయంతి బస్ దిగి రోడ్డు కవతలివేపున్న భవనాల వేపు చూసింది. ఒకదాని పక్కనే ఒకటి ఆకాశాన్నంటుతున్నట్లున్నాయవి. వాటిల్లో తనక్కావలసిన బిల్డింగ్ ఏదో తెలీదు.

ఎప్పుడో— తమకు పెళ్ళయిన కొత్తలో... ఓసారి సినిమాకెళ్తాంటే— దూరంనించీ తన ఆఫీస్ బిల్డింగ్ చూపించాడు రావ్.

అంతే! ఆ తరువాతెప్పుడూ పట్టించుకోలేదు మళ్ళీ.

బహుశా ఆ నాలుగో భవనం అయుండాలి.

అటూ, ఇటూ చూచి రోడ్డు దాటడానికి ప్రయత్నించిందామె.

కానీ కార్లూ, బస్‌లూ, ఆటోలూ, సైకిళ్లూ ప్రవాహంలా— ఎడతెరిపి లేకుండా సాగిపోతున్నయ్.

దాటడానికి అయిదు నిముషాలు పట్టింది.

నాలుగో బిల్డింగ్ దగ్గర ఆగి లోపలకు చూచింది.

ఎదురుగ్గా గోడమీద— ఏ అంతస్తులో— ఏ ఆఫీసుందో— తెలిపే సూచిక ఉంది.

ఒక్కొక్క ఆఫీస్ పేరూ పరీక్షగా చూడ సాగిందామె.

ఆరో అంతస్తు దగ్గర కనిపించిందా పేరు.

"క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్."

అదే అతని ఆఫీస్ !

ఆ ఆఫీస్ కనుక్కోడానికి ఎంత సేపు తిరగాలోనని చాలా భయపడిపోయింది తను అసలు కనుక్కోగలదో లేదోనని అనుమానం !

లిఫ్ట్ దగ్గరకు వెళ్ళి నిలబడిందామె

అప్పటికే చాలామంది లిఫ్ట్ కోసం వేచి ఉన్నారు

యారోమార్క్ కిందివేపుకి తిరిగింది

పది, తొమ్మిది, ఎనిమిది, ఏడు, ఆరు, అయిదు, నాలుగు, మూడు, రెండు, గ్రౌండ్—

అందరూ లిఫ్ట్‌లోకి గిలబిల జొరబడిపోయేరు

తనూ వెళ్ళి వారిమధ్యనే ఇరుక్కుని నిలబడింది జయంతి

ఒక్కొక్క అంతస్తు పైకెళ్తున్నకొద్దీ ఆమెలో ఎందుకో — తెలీని — ఆందోళన పెరిగిపోసాగింది

అతనేమంటాడు ?

తనతో మాట్లాడతాడా అసలు ?

తను చెప్పేది వినిపించుకుంటాడా ?

తన కోరిక అంగీకరిస్తాడా ?

ముందుగా తనేం మాట్లాడాలి ? ఎలా పలుకరించాలి ఆలోచిస్తున్నకొద్దీ మరింత కలవరపాటుగా ఉంది

అంతకు ముందురోజు రాత్రి ఆలోచించుకున్నదంతా గుర్తు లేకుండాపోయింది

సిక్స్త్ ఫ్లోర్ —

గుండెలు గుభేలుమన్నయ్ —

త్వరత్వరగా లిఫ్ట్ బయటకు నడిచింది

ఎదురుగ్గా కారిడార్ —

లిఫ్ట్ పైకి వెళ్ళిపోయింది

కారిడార్‌లో తనొక్కర్తే ఒంటరిగా మిగిలింది

ఎదురుగ్గా బోర్డ్ కనబడుతోంది "క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్"

శరీరమంతా కంపించసాగింది

ఇదేమిటి ? ఎందుకిలా భయపడుతోంది తను ? ఎందుకింత కలవరపాటు ?

అతను తననేమంటాడు ? ఇష్టమయితే ఒప్పుకుంటాడు — లేకపోతే లేదు —

అంతే !

ఆ మాత్రానికి ఏమిటీ అశాంతి ?

ఆఫీస్ డోర్ దగ్గరకు నడిచి లోపలకు తొంగి చూచిందామె వరుసగా టేబుల్స్ కనిపించినాయ్ ఒకరి వెనుక ఒకరు కూర్చుని పని చేసుకుంటున్నారు రెండు వరుసలు ఉన్నాయలా !

రావ్ ఎక్కడున్నాడు ?

చివరివరకూ పరీక్షగా చూడాలి —

"ఏం కావాలమ్మా ?" ప్యూన్ ఆమె దగ్గర కొచ్చి అడిగాడు

"రావ్ గారు కావాలి ఆయనతో మాట్లాడాలి " తడబడుతూ అందామె

"ఏ రావ్‌గారు ?"

"కె రావ్ — డిజైన్ అసిస్టెంట్ — "

"అదుగో—ఆ విజిటర్స్ రూమ్‌లోకూర్చోండి— ఆయనకు చెప్తాను "

ఎదురుగ్గా ఉన్న విజిటర్స్ రూమ్‌లోకి నడిచింది జయంతి

లోపల రెండు సోఫాలున్నాయ్ — వాటి మధ్య ఓ టిపాయ్ — టిపాయ్‌మీద కొన్ని మాగజైన్లు - కిటికీలకు అందమయిన కర్టెన్లు !

సోఫాలో కూర్చుందామె

ఎంత ప్రయత్నించినా మామూలుగా ఉండడం సాధ్యం కావటంలేదు ఇంకొద్ది క్షణాలు —

అంతే !

అతను తనెదురుగ్గా ఉంటాడు. సంవత్సరం తర్వాత కలుసుకోబోతున్నారిద్దరూ.

తనను చూచి ఆశ్చర్యపోతాడు. కోపం వస్తుందేమో ఆ తరువాత ? 'గెటౌట్' అంటాడేమో —

బూట్ల శబ్దం —

అదే శబ్దం — అతనే — సందేహం లేదు

లోపలకు అడుగుబెడుతూనే తనను చూచి షాక్ తిన్నట్లు నిలబడిపోయాడు. అతని మొఖంలో ఏవేవో భావాలు — చదవడానికి వీల్లేనంత వేగంగా పరుగెట్టినయ్ అతని పెదాలు కదలటం లేదు —

కానీ అతని కళ్ళు ప్రశ్నిస్తున్నాయ్—ఏంకావాలి? ఎందుకొచ్చావ్ ? నాతో ఏం పని నీకు ?

మెల్లగా లేచి నిలబడింది జయంతి

"మీతో కొంచెం మాట్లాడాలి . " అతనివంక చూసి మళ్ళీ చూపులు మరల్చుకుందామె

"ఏ విషయం ?" గొంతులో కర్కశత్వం, మృదుత్వం — ఏదీ తెలీటంలేదు

"ఇక్కడ మాట్లాడడం — ఫరవాలేదా ? '

"ఏం ఫరవాలేదు — చెప్పు !"

జయంతి కెలా ప్రారంభించాలో తెలీటంలేదు క్షణాలు గడుస్తున్నకొద్దీ మాట రావడం మరింత కష్టమవుతోంది

"త్వరగా కానీ — నా కవతల పని ఉంది !" కిటికీలోనుంచి బయటకు చూస్తూ అన్నాడతను

"రేపు అరుణ్ పుట్టినోజు ! మీకు గుర్తుంది కదా !"

"అవును !"

"రేపు కొద్ది గంటలు వాడిని నాతో తీసుకెళ్ళవచ్చా ?"

అతని కళ్ళల్లో అయిష్టం కొట్టొచ్చినట్లు కనబడుతోంది "వీల్లేదు—" అని చెప్పాలనే ఉంది కానీ కానీ అలా చెప్పటం సాధ్యం కాదు ఒప్పందం ప్రకారం — అప్పుడప్పుడు వాడితో గడిపే హక్కు ఆమెకుంది

"ఎంతసేపు ?" కొద్దిక్షణాల తర్వాత అడిగాడతను

"ఉదయంనుంచీ సాయింత్రం ఆరు గంటల వరకూ !"

"అంతసేపా ? వాడి స్కూలు సంగతేమిటి ?"

"ఒక్కరోజే కదా — స్కూలు మానిపిస్తే నష్టమేముంది ? అదివరకు ప్రతి బర్త్‌డేకి స్కూలు మానిపించేవాళ్ళం "

"అప్పటి సంగతి అనవసరం" తీవ్రంగా అన్నాడతను

ఆమె మౌనంగా ఉండిపోయింది

"అయినా అంతసేపు కుదరదు — కావాలంటే ఒకటి రెండు గంటలు — " కొద్దిక్షణాల తర్వాత అన్నాడు

"ఈ సంవత్సరకాలంలో ఎప్పుడూ నేను వాడిని కలుసుకోలేదు ఈ ఒక్కరోజయినా ఎక్కువసేపు గడిపితే — సంతృప్తిగా ఉంటుంది "

"కానీ వాడి పుట్టినోజు నేను మాత్రం జరుపుకోవద్దూ ?"

ఆమెకు కోపం ముంచుకొచ్చింది

రోషంగా అతనివేపు చూసింది

"గత ఆరేళ్ళల్లోనూ ఓ ఒక్క పుట్టినోజు కయినా మీరు ఇంటిదగ్గర గడిపారా ? ఇప్పుడు కేవలం అడ్డుపడడానికే అలా అంటున్నారు "

రావ్ ముఖం కోపంతో జేవురించింది

"ఆ విషయం నీ కనవసరం !"

ఆమె చప్పున తగ్గిపోయింది

తను కోపంలో ఎంత అర్థరహితంగా మాట్లాడిందీ తెలుస్తూనే ఉంది

అతనలా మాట్లాడడంలో తప్పులేదు పాత విషయాలు మాట్లాడడానికి తనకేమి హక్కుంది ?

అతని విషయాలు మాట్లాడడానికి తనెవరిప్పుడు ?

"అయామ్ సారీ ?" గొణుక్కుంటున్నట్లు అందామె

అతను ఆలోచనలో పడ్డాడు ఆమె తనతప్పు ఒప్పుకోవడం కొంత చిరాకుని తగ్గించింది

"కావాలంటే ఉదయం ఎనిమిది గంటలకు తీసుకెళ్ళి సాయంత్రం అయిదింటికల్లా పంపించెయ్ అయ్ వాన్ట్ టు స్పెండ్ ది ఈవినింగ్ విత్ హిమ్—"

ఇంక అతనితో మాట్లాడి కూడా ఉపయోగం లేదని ఆమెకు అర్థమయిపోయింది

"సరే ! రేపు నేను మరి అరుణ్ కోసం ఇంటికి రానా ?" సంకోచిస్తూనే అడిగింది

"నో !" కఠినంగా అన్నాడతను

"నువ్వు ఇంటికి రానక్కర్లేదు "

ఆమె మొఖం చిన్నబోయింది

"సరిగ్గా ఎనిమిదింటికి ఇక్కడికే వచ్చెయ్— నేను అరుణ్‌ని ఇక్కడికి తీసుకొస్తాను—"

"సరే—" అంది జయంతి

అతను వెనక్కు తిరిగి బయటకు రెండడుగులు వేసి ఆగి ఆమెవేపు చూచి "ఇంక వెళ్ళు !" అన్నాడు

జయంతి కారిడార్‌లో కొచ్చి లిఫ్ట్ దగ్గర నిలబడింది

అప్పుడే లిఫ్ట్ పైనుంచి వచ్చి ఆగింది

మరుక్షణంలో మెయిన్‌రోడ్‌మీద నడవసాగిందామె

ఆ రాత్రంతా ఆమెకు నిద్రలేదు ఉదయం అరుణ్ తనతోపాటు తన ఇంటికొస్తాడన్న ఆనందం రెప్ప మూయనీయడం లేదు

సంవత్సరం అవుతోంది— తనూ, రావ్ విడాకులు తీసుకుని ఈ సంవత్సర కాలంలో ఎన్నోసార్లు తపించిపోయింది— తనకున్న ఒకే ఒక్క కొడుకుని చూడాలని! కానీ బలవంతంగా ఆ కోరికను అణచుకోవలసి వచ్చింది

రత్నాకర్ చాలాసార్లు అడిగాడు

ఎందుకలా ఉంటున్నావీమధ్య అంటూ—

అందుక్కారణం— తన ఆరేళ్ళ కొడుకు

అరుణ్— అన్న విషయం చెప్పాలంటే తనకు సంకోచం కలిగింది

కానీ ఎంతకాలం దాచగలదా విషయాన్ని ?

అసలు విషయం తెలుసుకున్న రత్నాకర్ ఓ ఉపాయం ఆలోచించాడు

"పోనీ — అరుణ్ చదివేస్కూల్ దగ్గరకెళ్ళి నిలబడదాం — పద ! వాడిని చూడడానికి అవకాశం ఉంటుంది — "

ఆ మర్నాడే పొద్దున్న స్కూల్ టైమ్‌కి స్కూల్ దగ్గరకు తీసుకెళ్ళాడతను

గేటుకి దూరంగా నిలబడ్డారిద్దరూ మరి కొద్దిసేపటి తర్వాత అరుణ్ కనిపించాడు

రిక్షావాడు స్కూలుముందు రిక్షా ఆపి, అరుణ్‌ని దింపి స్కూల్లోకి నడిపించుకెళ్ళాడు

అప్రయత్నంగా కళ్ళు చెమ్మగిల్లినయ్ జయంతికి పరుగుతో వెళ్ళి వాడిని గుండెలకు హత్తుకుని తనివి తీరా ముద్దాడాలనిపించింది రత్నాకర్ తనను చేయి పట్టుకుని ఆపకపోయినట్లయితే అంతపనీ చేసేదే కూడా !

"వద్దు — జయంతీ ! నిన్ను చూచేడంటే — అరుణ్ నిన్ను వదలడు — స్కూలుకి కూడా వెళ్ళనంటాడు — ఈ గొడవంతా రావ్‌కి తెలిసిందంటే బావుండదు — "

ఆ మాట తనలోని ఆలోచనల్ని చంపేసింది

నిజమే ! రావ్‌కి తెలిసిందంటే — తనను చాలా అవమాన పరుస్తాడు

అరుణ్ లోపలి గేటుదగ్గర ఆగి రిక్షావాడివేపు తిరిగి 'టాటా' చెప్పాడు చిరునవ్వుతో

రిక్షావాడుకూడా చేయి ఊపాడు

వాడు లోపలికెళ్ళిపోయాడు

జయంతికి కళ్ళవెంబడి నీళ్ళు తిరిగినయ్

తనే నేర్పింది — వాడికి టాటా చెప్పటం !

ఆ తరువాత మరోసారి చూసింది స్కూలు దగ్గర - అంతే ! మళ్ళీ ఇన్నాళ్ళకు వాడితో గడప బోతోంది

వాడికోసం ఎన్నెన్నో ఆటవస్తులు, తిను బండారాలు — కొత్తబట్టలు అన్నీ కొనుక్కొచ్చి సిద్ధంగా ఉంచింది

పూర్తిగా తెల్లారకుండానే లేచి కూర్చుందామె.

రత్నాకర్ ఇంకా గాఢ నిద్రలోనే ఉన్నాడు

ఆ రాత్రి చాలా ఆలస్యంగా ఇంటికొచ్చాడతను. తూలుతూనే లోపలికొచ్చి బట్టలు కూడా మార్చుకోకుండా పడుకున్నాడు

'సారీ జయా ! ఇవాళ 'మందు' ఎక్కువయి పోయింది " అన్నాడు ఆమెతో

జయంతి మౌనంగా ఉండిపోయింది సమాధానం ఇవ్వలేదు

ఏం మాట్లాడగలదు ?

అతనిని చేసుకునేముందు తనకి తెలీదు—అతనికి తాగుడు అంతగా అలవాటని ! ఒకవేళ తెలిసి వుంటే తెలిసివుంటే ఏంచేసేది ? అతనిని చేసుకోడానికి అంగీకరించేది కాదా ? అలాంటివాడిని చేసుకుని ఒంటరితనం అనుభవించడం కంటె — ఒంటరిగానే మిగిలిపోవాలన్న నిర్ణయం తీసుకునేదా ? ఏమో — తనకీ తెలీదు అతనుకూడా రావ్‌లానే

# ఒంటరి

ప్రవర్తిస్తాడని ముందే తెలిసి ఉంటే — బహుశా రావ్ నుంచి విడాకులు కోరేది కాదేమో —

జయంతి చిరాకుగా బెడ్‌రూమ్‌లోనుంచి బయటికొచ్చింది ఆ ఆలోచనల్నుంచి తప్పించుకోవాలి ముందు ఇవాళ అరుణ్ వస్తున్నాడు చాలా ముఖ్యమయిన రోజిది తను ఇవాళ ఓ నిర్ణయం తీసుకోబోతోంది చాలా ముఖ్యమయిన నిర్ణయం అది మరోసారి పశ్చాత్తాప పడడానికి వీల్లేని నిర్ణయం —

త్వరత్వరగా తయారయిందామె టైమ్ ఏడున్నరయిపోయింది ఆటోలో రావ్ ఆఫీస్ దగ్గరకు చేరుకునేసరికి రావ్ అక్కడ తనకోసం ఎదురుచూస్తూ కనిపించాడు

అతని పక్కనే అరుణ్

అరుణ్‌ని చూడడంతోనే ఆమెకు ప్రాణం లేచివచ్చినట్లయింది

"అరుణ్ !" అంటూ ప్రేమగా పిలిచింది

అరుణ్ ఆమెవేపు చూశాడు అతని మొఖంలో ఏ భావమూ లేదు తండ్రివేపు చూశాడు వివరాల కోసం —

రావ్ గర్వంగా నవ్వుకున్నాడు

"చూడమ్మా ! నువ్— ఈ ఆంటీ వాళ్ళింటి కెళ్ళు— నేను ఆఫీసులో ఉంటాను— సాయంత్రం వచ్చేద్దుగాని మళ్ళీ— సరేనా ?" అన్నాడు రావ్

వాడు అంగీకారసూచకంగా తలూపాడు

"ఓ కే ! తీసుకెళ్ళు సరిగ్గా అయిదు గంటల కల్లా ఇక్కడ ఉండాలి మళ్ళీ—" ఆమెకు చెప్పాడతను

జయంతి అరుణ్ చేయి పట్టుకుంది

"టాటా డాడీ "

"టా టా—"

ఆటోలో కూర్చున్నారిద్దరూ

అరుణ్‌ని తన దగ్గరకు లాక్కుంది జయంతి వాడి చెక్కిళ్ళమీద ముద్దు పెట్టుకుంది,

వాడు అయిష్టంగా చూశాడామెవేపు

"ఒరే అరుణ్ — నేను మీ మమ్మీనిరా ! మర్చిపోయావా ?"

వాడు తనకేమీ పట్టనట్లు రోడ్డువేపు చూస్తున్నాడు

అంటే వాడు తనను పూర్తిగా మర్చిపోయాడన్నమాట నిరాశతో కృంగిపోయిందామె ఆరేళ్ళు వాడిని ఎంతో ప్రేమతో పెంచింది తను— కానీ వాడు ఒక్క సంవత్సరంలో ఎలా మర్చిపోగలిగాడు ?

ఇంటికి చేరుకున్నారు

రత్నాకర్ ఇంకా నిద్ర లేవలేదు

అరుణ్ ఇల్లంతా కలియచూశాడు అంతా కొత్తగా ఉంది

"ఇదిగో— నీకోసం ఎన్ని ఆటవస్తువులు కొన్నానో చూడు— మరి ఇవన్నీ కావాలా నీకు ?" వాడిని దగ్గరకు తీసుకుని ఆట వస్తువులు ఒన్నీ చూపుతూ అడిగిందామె

"వద్దు !"

"ఎందుకని ?" ఆశ్చర్యంగా అడిగిందామె

వాడు ఆమె చేయి వదిలించుకుని వెళ్ళి తలుపు దగ్గర నిలబడి బయట రోడ్డువేపు చూడసాగాడు

జయంతి చాలా నిరుత్సాహపడిపోయింది తనను చూడగానే, వాడు తనను కౌగలించుకుంటాడనీ, 'మమ్మీ' అంటూ తన వెనుకే తిరుగుతాడనీ, ఎన్నో ఊహించుకుంది

మళ్ళీ వాడిదగ్గరకెళ్ళి వాడిని ఎత్తుకుంది జయంతి

"పద — నీకు ఫలహారం పెడతాను "

వాడేమీ మాట్లాడలేదు

"నన్ను మర్చిపోయావంట్రా నేనురా మీ మమ్మీని — "

"నన్ను దింపెయ్ " అయిష్టంగా అన్నాడు వాడు

ఆమె మనసు పాడయిపోయింది వాడు తనను పూర్తిగా మర్చిపోయాడు

"మా చిట్టివి కదూ — ఇదుగో — నీ కోసం పాయసం — జిలేబీలు — ఇంకా బోలెడు మిఠాయి "

"నాకొద్దు — "

"మా తండ్రివి కదూ — నీకేం కావాలో అది తినమ్మా !"

"వద్దు — "

రత్నాకర్ గది గడపలో నిలబడి గట్టిగా నవ్వాడు

"ఎందుకోయ్ — అంత తాపత్రయం ? వాడు నిన్ను మర్చిపోయినట్టున్నాడు "

జయంతి అతనివంక చూస్తుండిపోయింది

"వీల్లేదు — వీడు నా కొడుకండీ ! నా కొడుకు నన్ను మర్చిపోడానికి వీల్లేదు" లోలోపలే గొణుక్కుంది

రత్నాకర్ ఫలహారంచేసి ఆఫీస్‌కి బయల్దేరాడు

"ఇవాళయినా పెందలాడే వస్తారా ?" అడిగింది జయంతి

"ఓ—యస్—బై—నైన్ "

"బై—నైన్ — " కసిగా అనుకుందామె

అతను వెళ్ళిపోయాడు

మళ్ళీ అరుణ్ దగ్గరకొచ్చిందామె

"ఒరేయ్ అరుణ్‌బాబూ — నీ కోసం కొత్త బట్టలు తెచ్చాను — వేసుకుంటావా ?"

"నేను వెళ్ళిపోతా !" ఏడుపు ముఖంతో అన్నాడు వాడు

"ఎక్కడికి ?"

"మా ఇంటికి — "

"ఈ ఇల్లు బాగుండలేదా ?"

"నేను వెళ్ళిపోతా !" ఏడుపు ప్రారంభమయి పోయింది

జయంతి వాడిని మరిపించడానికి విశ్వప్రయత్నం చేయసాగింది కానీ వాడి ఏడుపు క్రమంగా పెరిగి పోతూనే ఉంది మరి కాసేపట్లో బిగ్గరగా—ఇల్లెగిరి పోయేలా—

"వెళ్ళిపోతా— డాడీ దగ్గరకెళ్ళిపోతా—" జయంతికి తెలిసిపోయింది వాడిని ఆపడం తనవల్ల కాదు— చేసేది లేక వాడిని తీసుకుని మళ్ళీ రావ్ ఆఫీస్ చేరుకుందామె

రావ్ మళ్ళీ విజిటర్స్ రూములోకొచ్చాడు

"మీదగ్గర కెళ్తానని ఒకటే ఏడుపు—" తన

ఏడుపు ఆపుకుంటూ అంది జయంతి

రావ్ కళ్ళల్లో గర్వం—

అరుణ్ పరుగుతో వెళ్ళి రావ్‌ని కౌగలించుకున్నాడు

"నాకు తెలుసు— వాడు నన్నొదిలి ఉండలేడు— ఇంకెప్పుడూ రాకు— వాడికోసం!"

జయంతి తల వంచుకుని వచ్చేసింది

ఇంటి తాళంతీసి లోపలకు అడుగుపెట్టి తలుపులు మూసివేసింది—

పెద్ద వికటాట్టహాసం— కేకలు— ఆనందం పట్టలేనట్లు అరుపులు—

ఎవరది? ఎవరిదా వికటాట్టహాసం?

జయంతి గదిమధ్యలో నిలబడి పోయింది.

ఆ వికటాట్టహాసం చిన్నప్పటినుంచి తనకు పరిచయమైనదే, చిన్నప్పటినుంచీ అనుక్షణం ఆ



విద్యార్థిలోకం వ్యాసరచన పోటీలో ప్రత్యేక బహుమతి రు. 150/-లు పొందిన వ్యాసం

# మా విద్యార్థిలోకం ఆశయాలు

మానవుడు జీవించడానికి కూడ — గూడు — గుడ్డ ఇవి ముఖ్య అవసరాలు భూమిమీద పుట్టి పెరిగే ప్రతి వ్యక్తికి ఈ నిత్యావసరాలు లేనిదే జీవించడమే కష్టం అవుతుంది వీటిలో అతిముఖ్యం ఆహారము ఆహారం లేనిదే ఏ జీవి ఎక్కువ కాలం బ్రతుకదు అయితే "కోటి విద్యలు కూటికొరకే" అన్నట్లు విద్యను నేడు ఏ విద్యార్థి అయినా జీవనోపాధి కోసం అభ్యసిస్తున్నాడు పూర్వకాలంలో విద్య విజ్ఞాన సముపార్జనకే ముఖ్యంగా ఎన్నుకోబడేవి తర్వాత ఆ విద్య ఉపాధిని చూపించేది కాని ప్రావీణ్యం కొరకు విద్య సంపాదించేవారేకాని పొట్టకూటికి విద్యను అభ్యసించేవారు కాదు పూర్వం ప్రపంచ జనాభా కూడా తక్కువగా ఉండటంచేత ఉపాధికి విద్యను అభ్యసించడం చాలా అరుదుగా ఉండేది

నేడు విద్యార్థులలో ఎటు చూసినా "అసంతృప్తి — నిరాశ" కనుపిస్తున్నాయి ఒక వ్యక్తి తన కుమారుడినో, లేక కుమార్తెనో చదివించడానికి ముందుగానే ఆ కుమారుడు లేక కుమార్తె డాక్టరు కావాలనో, ఇంజనీరు కావాలనో, లెక్చరర్ కావాలనో, కలెక్టర్ కావాలనో ఊహించి చదువు ప్రారంభిస్తున్నాడు దాని పర్యవసానంగా ఆ తండ్రి లేక ఆ పిల్లలు వారు కోరిన విద్యలో డిగ్రీమీదే దృష్టి నిలిపి అనేక సవ్య అపసవ్య మార్గాల ద్వారా ఆ డిగ్రీ సంపాదించి వారు కోరిన ఉపాధినే ఏర్పాటు చేసుకుంటున్నారు అంతేకాని విద్యలో ఉన్నత ప్రమాణాలను సాధించడానికి ఎక్కువమంది ప్రయత్నించడములేదు

నేటి విద్యార్థులలో చాలమందికి ఆశయసిద్ధి లేదు ఒక విద్యార్థిని పరీక్షించడానికి "నీవు ఎందుకు చదువుచున్నావని" ప్రశ్నిస్తే — "ఉద్యోగం కోసం" అనో లేదా "ఏమో" అనో జవాబిస్తాడు దీనినిబట్టి విద్యార్థులలో సరైన దృక్పథం లేదని ఋజువు అవుతున్నది విద్య విజ్ఞానం కోసం అభ్యసించడం "ఉత్తమ పద్ధతి" ఉపాధి కోసం అభ్యసించడం "రెండవ పద్ధతి" అయితే ఏ ఆదర్శం, ఆశయం లేకుండా "నేనెందుకో చదువుచున్నాను" లేక "నా తలిదండ్రులు చదివించుచున్నారు కనుక నేను చదువుచున్నాను" అని జవాబు చెప్పే విద్యార్థులలో సరియైన దృక్పథం లేదనే చెప్పాలి

## రచయిత పరిచయం



"నా పేరు బి. రాంబాబు. వయస్సు 19 సం, నా తండ్రి పేరు బి అభిమన్యుడు నేను పుట్టినది ఒంగోలు, పెరిగింది భీమవరంలో, చదువు భీమవరం కె జి ఆర్ యల్ కాలేజిలో ప్రథమ బి ఎ చదువుచున్నాను నాకు తెలుగు సాహిత్యమంటే చాల ఇష్టం వ్యాస రచనలు, వక్తృత్వపు పోటీలలో పాల్గొనటము, జనరల్ నాలెడ్జి టెస్టుల్లో పాల్గొనటము, పత్రికలు చదవటము, కార్టూన్ లు వ్రాయడము నా హాబీ నాకు వ్యాసరచన పోటీలో ప్రత్యేక బహుమతి ఇచ్చినందున ఆంధ్ర సచిత్ర వార పత్రిక సంపాదకులకు కృతజ్ఞతలు తెలుపుచున్నాను"

— బి రాంబాబు

నేటి విద్యావిధానంలోపభూయిష్టంగా ఉండటంచేత విద్యార్థులు అక్రమ మార్గాల ద్వారా డిగ్రీలు సంపాదిస్తున్నారు కాపీలు చేసో, డబ్బు చెల్లించి మార్కులు వేయించుకునో, రికమెండేషన్‌వల్ల మార్కులు వేయించుకునో ఉద్యోగాలు సంపాదించుకొని ప్రజలు బ్రతుకు తెరువు కోసం నేడు ప్రాకులాడుతున్నారు విద్యావిధానం మారాలి విద్యార్థి బ్రతుకుతెరువు కోసం కాక జ్ఞానం కోసం విద్యనభ్యసించిననాడే విద్యాస్థాయి పెరుగుతుంది

మన ప్రభుత్వం కొన్ని వందల కోట్ల రూపాయలు విద్య కోసం ఖర్చు పెడుతోంది అయినా విద్య అయిన తరువాత విద్యార్థులు నిరుద్యోగులుగానే మిగిలిపోతున్నారు అలాకాక ప్రభుత్వం విధానాలు మార్చి, ఉన్నత విద్యా ప్రమాణాలు సృష్టించి, ఉపాధి మార్గాలను విరివిగా కల్పించాలి

విద్యార్థులలో కూడా దృక్పథం మారాలి ఉన్నత ఉద్యోగం కోసం చదువుతున్నాననే భావన విద్యార్థులలో కలగాలి బ్రతుకుతెరువు కోసం విద్యార్థి భయపడక చక్కని జ్ఞానముతో కూడిన విద్యను సంపాదించి స్వేచ్ఛగా బ్రతుకగల వాతావరణాన్ని తాను సృష్టించుకోవాలి అందుకు దోహదం చేసేదిగా విద్యావిధానం మారాలి అంతేకాని "కోర్సులు" మార్చి విద్యార్థులపై ప్రభుత్వం ప్రయోగాలు చేసినంత మాత్రాన ఫలితాలు రావు తాను తన కాళ్ళపై నిలబడి, పదిమందికి బ్రతుకుట నేర్పగలవాడే సరియైన విద్యను అభ్యసించిన వాడగును

"విద్యా వినయేన శోభతే" అని చెప్పినట్లు విద్య వినయగుణములను నేర్పి జీవితమును చక్కదిద్దునదిగ యుండవలెను కావున మన విద్యార్థిలోకము ఈ విషయములను మనస్సుయందుంచుకొని చక్కని ఆశయములతో, క్రమశిక్షణతో, ఆశయసిద్ధికి ఉత్తమమగు విద్య నేర్పవలెను ★

రాక్షసినుంచే తప్పించుకోడానికి ప్రయత్నిస్తోంది తను కానీ ఎప్పటికప్పుడు ఓటమే—

చిన్నప్పుడు తనను ఆయాకు అప్పగించి తండ్రి ఆఫీస్ కెళ్ళాక— ఆయా తనను ఇంట్లో పెట్టి, తాళంవేసి సాయంత్రం వరకూ ఎక్కడెక్కడో తిరగడానికెళ్ళినప్పుడూ—

పెద్దయ్యాక ఉదయంనుంచి అర్ధరాత్రి వరకూ— తండ్రి క్లబ్‌నుంచి ఇంటికి చేరుకునే వరకూ, రావ్‌తో పెళ్ళయ్యాక, రావ్ రోజూ రాత్రి రెండు, మూడు గంటలవరకూ పేకాటలో గడిపి





నప్పుడూ, తరచుగా రోజులతరబడి ఇంటిమొఖం చూడనప్పుడూ—

అతనిని కాదని రత్నాకర్‌ని పెళ్ళి చేసుకుని త్వరలోనే అతడు తాగుడుకు బానిసని తెలుసుకున్నప్పుడూ— ఇంట్లోనూ బయటా కూడా మత్తులో పడివుండే అతనిని చూస్తున్నప్పుడూ—

ఆ వంటరితన వికటాట్టహాసమే తనను చిత్రవధ చేస్తోంది చిత్రహింసలు పెడుతోంది

ఆఖరిసారిగా— అన్ని బంధాలూ తెంచుకుని, తనెవ్వరికీ చెందకుండా— అందరికీ దూరంగా— రత్నాకర్‌ని కూడా కాదని— కేవలం తన అరుణితో కలిసి ఆ వికటాట్టహాసాన్ని ఎదుర్కోవాలనుకుంది కోర్టు ద్వారానయినా వాడిని పొందాలని అనుకుంది — కానీ — కానీ — మళ్ళీ మళ్ళీ — ఆ వికటాట్టహాసమే గెలిచింది

తనను చిత్తుగా ఓడించింది

జయంతి అలాగే నిలబడి ఉంది — ఆమె కళ్ళ వెంబడి నీళ్ళు కారిపోతూనే ఉన్నాయ్—క్రమక్రమంగా ఒంటరితనపు వికటాట్టహాసపు ధ్వని ఎక్కువయి పోతోంది ★